కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభాత వార్త
శనివారం 13 డిసెంబర్ 2025

## ఇంగ్లీష్ బాగా మాట్లాడేలా చర్యలు తీసుకోవాలి

రామాపురం, డిసెంబర్ 12: ప్రభాతవార్త



విద్యార్థులు ఇంగ్లీష్ బాగా మాట్లాడేలా చర్యలు తీసుకోవాలని. కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు శుక్రవారం మండలంలోని ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ఇంగ్లీష్ బాగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు తరగతి గదులలో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నప్పుడు రాసుకున్న నోటు పుస్తకాలను తనిఖీ చేశారు. విద్యార్థులు రాసుకుంటున్న నోటు పుస్తకాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సరిగా రాసుకుంటున్నారా లేదా అనే అంశంపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న నీటి వసతి, పాఠశాలలో పారిశుధ్యం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తగు సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తుండగా స్వయంగా తనిఖీ చేశారు.

## జనం గుండె చప్పుడు వినండి చంద్రన్నా...

### ఇప్పుడు న్యాయం చేయకపోతే ఎప్పుడు చేస్తారన్నా...?

రాజంపేట, డిసెంబర్12 ప్రభాతవార్త

వైసిపి హయాంలో ఇష్టము వచ్చినట్లు జిల్లా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పుడు అన్యాయం జరిగిందని రోడ్డు మీద పడ్డాం. ఇప్పుడు మరలా రోడ్డుమీదికి వచ్చాం. నాడు జరిగిన అన్యాయానికి మీరే న్యాయం చేస్తామని చెప్పారు. ఇప్పుడు మన ప్రభుత్వమే ఉంది. ఇప్పుడు న్యాయం చేయకపోతే ఇంకెప్పుడు చేస్తారన్నా? మీరు జైల్లో ఉన్నప్పుడు మీకోసం రోడ్డెక్కాం . మీరు బయటకు వచ్చేంత వరకు మీకు అండగా నిలిచాం. ఇప్పుడు మీరు మాకు అండగా నిలబడండి. భావితరాలు గుర్తుంచుకునేలా రాజంపేటను జిల్లా కేంద్రం ప్రకటించండి అంటూ తెలుగు తమ్ముళ్ల శుక్రవారం మూడో రోజు జిల్లా కేంద్ర సాధన కోసం జరుగుతున్న దీక్షలో డిమాండ్ చేశారు. ముక్తకంఠంతో చంద్రన్నా మాకు న్యాయం చేయండి అంటూ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రం ప్రకటించేవరకు కూటమి పార్టీల నాయకులు, పార్టీ శ్రేణులు ఉద్యమంలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. మూడో రోజు దీక్షలో కూర్చున్న పార్టీ నాయకులకు అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్రాజు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. మరోవైపు భవనిర్మాణ కార్మికులు జిల్లా కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ పాత బస్టాండ్ లో ర్యాలీ నిర్వహించారు. నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా కేంద్రం ఉద్యమానికి మద్దతు ప్రకటించి దీక్ష శిబిరంలో పాలుపంచుకున్నారు. మూడో రోజు దీక్షలలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కే.చంగల్ రాయుడు, ఊటుకూరు సుబ్బరాయుడు, మేక నరసింహ, హరీష్, మన్సూర్, సిద్ధిక్, కళాధర్ తదితరులు కూర్చున్నారు.

# వేతనాల పెంపు పై గర్జించిన అంగన్వాడీలు





రాయచోటి టౌన్ డిసెంబర్ 12 ప్రభాతవార్త

వేతనాలు పెంచాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట మూడు గంటలు పాటు సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకుల సహకారంతో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్ద ఎత్తున పాల్గొని నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి అధ్యక్షులు శ్రీలక్ష్మి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబుళమ్మ ఏఐటీయూసీ తరుపున అధ్యక్షులు సరోజ లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని , గుజరాత్ హై కోర్టు తీర్పు ప్రకారం వర్కర్స్ ను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 24300ఇవ్వాలని హెల్పర్లను మూడవ తరగతి ఉద్యోగులుగా మార్చి20400 జీతం ఇచ్చేవరకు నిరవధిక పోరాటాలు చేస్తామని తెలిపారు. గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. షరతులు లేకుండా 1810 మంది మినీ వర్కర్స్ ను మెయిన్ వర్కర్స్ గా చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చియాప్ ల పేరు తో పని భారం పెంచిందే కానీ వేతనం పెంచలేదని మండిపడ్డారు. ప్రమోషన్ లు ఇవ్వాలని రిటైర్డ్ మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, జనాభా కానుగుణంగా కొత్త అంగన్వాడీ కేంద్రాలు తెచ్చి పేద బాలింతలకి గర్భవతులకి ఆహార,ఆరోగ్య సేవలు అందించాలని కోరారు.అనేక మీటింగ్ల పేరుతో నెలలో ఎటువంటి టీఏలు ఇవ్వకుండా 5 నుండి 7 సమావేశాల వరకు కు పిలవడం దారుణం అన్నారు. కనీస వేతనాలతో పాటు పెండింగ్ జీతా లు, బిల్లులు సకాలంలో ఇవ్వాలని కోరారు. రాజంపేట చిట్వేలి లక్కిరెడ్డి పల్లి ప్రాంతాలకు పెండింగ్ జీ తాలు విడుదల చేయాలని కలెక్టర్ ఆఫీస్ లోకి పెద్ద ఎత్తున అంగన్వాడీ లు దూసుకుపోవడం తో అర్బన్ సిఐ బీవీ చలపతి బందోబస్త్ చేసి అంగన్వాడీ లను కార్మిక నాయకుల నిలువరించారు. తర్వాత పీడీ హైమావతికి మరియు ఆర్డిఓ మధుసూదన్ రావుకి వినతిపత్రం ఇచ్చారు. ఈ నెల 16 వ తేదీ అంగన్వాడీ లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి ఐసీడీస్ అధికారులతో మరియు యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి కృషి చేస్తానని హామీఇచ్చినట్లు తెలిపారు. అంగన్వాడీ లకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శిపి. మహేష్ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సి హెచ్ చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం.సుధీర్ కుమార్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు యం. గంగాధర్ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దిగాళ్ల. శ్రీనివాసులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి రంగారెడ్డి లతో పాటు జిల్లా నాలుమూలల నుండి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి

## నాయకులు కూడా చొరవ చూపాలి

### టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ రాజు

రాజంపేట, డిసెంబర్12 ప్రభాతవార్త



వినతులు పరిశీలిస్తున్న జగన్మోహన్ రాజు

ప్రజలకు మేలు చేయాలనేది ప్రజా దర్బార్ ఉద్దేశమని, ప్రజా సమస్యల పరిష్కారానికి స్థానిక నేతలు కూడా చొరవ తీసుకోవాలని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు కోరారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం తన కార్యాలయంలో జగన్ మోహన్ రాజు ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమ లక్ష్యమన్నారు. మహిళలు ఎక్కువగా తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చారు. ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.అదేవిధంగా స్థానిక నాయకులు,అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని చమర్తి తెలియజేసారు.అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు టి సంజీవరావు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, రాంనగర్ నరసింహ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా 2కే రన్

ప్రొద్దుటూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త




పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రొద్దుటూరులో ఆదివారం ఉదయం 6 గంటలకు 2కే రన్ కార్యక్రమాన్ని శ్రీ రామచంద్ర మిషన్ మరియు రోటరీ క్లబ్ రోటరీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు, శ్రీరామచంద్ర మిషన్ (హార్ట్ఫుల్నెస్) సభ్యులు శుక్రవారం స్థానిక ప్రెస్క్లబ్లో వారు ఈ విషయమై ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. అనంతరం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడాశాఖ, ఫిట్ ఇండియా, ఫారెస్ట్స్ బై హార్ట్ఫుల్నెస్ మద్దతుతో రోటరీ క్లబ్, రోటరీ ఐ హాస్పిటల్, ప్రొద్దుటూరు మిడ్టౌన్ రోటరీ క్లబ్, శ్రీరామచంద్ర మిషన్ (హార్ట్ఫుల్ నెస్) సంయుక్త ఆధ్వర్యంలో ఈ రన్ జరుగుతోందని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణం దెబ్బతింటోందని, ఇప్పటికే చాలా ప్రాంతాల్లో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించారని వివరించారు. మన కడప జిల్లాలో కూడా ఆ తరహా ఆదేశాలు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా పర్యావరణ పరిరక్షణకు వృక్ష సంపద కూడా కీలకమని, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఎన్నో రకాల మొక్కలు నాటామని, ఇదే తరహాలో ప్రజలు కూడా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించే ఈ 2 కిలోమీటర్ల రన్ ప్రొద్దుటూరు మున్సిపల్ ఆఫీస్ నుంచి ప్రారంభమై, టీ.బీ. రోడ్ మీదుగా శివాలయం సర్కిల్ వరకు సాగుతుందని, ఉదయం 6:30 గంటలకు రన్ ప్రారంభం అవుతుందని, పాల్గొనే వారికి అల్పాహారం కూడా ఏర్పాటు చేశామని వివరించారు. ఆన్లైన్ నమోదు కోసం ప్రత్యేకంగా లింక్ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పర్యావరణ రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఈ రన్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ సి రాజశేఖర్, మిడ్ టౌన్ రోటరీ ప్రెసిడెంట్ ఉట్టి తిరుపతయ్య, మిడ్ టౌన్ రోటరీ సెక్రెటరీ బివి రాజు, రోటరీ ఐ హాస్పిటల్ ప్రెసిడెంట్ బాల సూర్యరావు, హార్ట్ ఫుల్ నెస్ వర్కింగ్ మెంబర్ పి సత్యప్రసాద్, హార్ట్ ఫుల్ నెస్ ట్రైనర్ కే అన్నపూర్ణ పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టాభిషేకం



పీలేరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, సమాజాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం శ్రమిస్తున్న సాధనా పాఠశాల కరెస్పాండెంట్ గుండ్రే వినుత రెడ్డి మరో అరుదైన గుర్తింపును అందుకున్నారు. హైదరాబాదు హైటెక్ సిటీలో ఎస్.డి ప్రోమో ఆధ్వర్యంలో ఈ.టి టెక్ సంస్థ ప్రోమో ప్రతినిధుల చేతుల మీదుగా ఆమెకు ప్రతిభ అవార్డు మరియు ప్రశంసా పత్రం ప్రదానం చేయడం జరిగింది.ఈ అవార్డుల ప్రధానోత్సవం విశిష్టమైన వాతావరణంలో జరగగా, వివిధ రంగాలకు చెందిన అతిథులు, ప్రముఖులు హాజరై వినుత రెడ్డి సేవలను ప్రశంసించారు. తమ విద్యా సేవల ద్వారా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడమే కాక తల్లిదండ్రుల జీవితాల్లో వెలుగు నింపిన విద్యావేత్తగా ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా వినుత రెడ్డి మాట్లాడుతూ"గత 23 సంవత్సరాలుగా సాధనా పాఠశాల, కార్పొరేట్ విద్యాసంస్థల సరసన నిలుస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తోంది. ఈ విద్యాసంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మా స్కూల్ తరఫున 15 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం విశేషం. మండలంలోనే మా పాఠశాల అగ్రగామిగా నిలవడం గర్వకారణం" అని పేర్కొన్నారు. అంతేకాక, రెండు ప్రతిభావార్డులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పాఠశాలకి ప్రధానం చేయడం, అలాగే తమ విద్యార్థులు జాతీయ–అంతర్జాతీయ స్థాయిలో సేవలు అందించడం నిజంగా తమ సంస్థ ప్రతిభకు పట్టాభిషేకమేనని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. సమాజ సేవకు, విద్యారంగ అభివృద్ధికి అంకితం చేసిన జీవితం వినుత రెడ్డి సేవలకు ఈ అవార్డు మరొక ప్రతిష్ఠాత్మక మైలురాయిగా నిలిచింది.

## హత్యకు గురైన నరసింహులు మృగదేహం గుర్తింపు

### వివాహేతర సంబంధమే హత్యకు కారణమా....?

మదనపల్లి క్రైమ్ డిసెంబర్ 12 ప్రభాతవార్త.



హత్యకు గురైన నరసింహులు (40) మృతదేహం ను రూరల్ పోలీసులు గుర్తించారు. 40 రోజుల క్రితం అదృష్టమైన నరసింహులు చంద్రగిరి మండలం మంగాపురం సమీపంలోని ఓ మామిడి తోటలో హత్యకు గురైనట్లు పోలీసుల దర్యాప్తులలో తెలిసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి రూరల్ మండలం మాలేపాడు పంచాయతీ ఆవులపల్లికి చెందిన నరసింహులు, సిటిఎం పంచాయతీ దిన్నె మీద పల్లెకు చెందిన నాగరాజులు మాయలు మంత్రాలు వేస్తూ జీవనం సాగిస్తున్నారు. అక్టోబర్ 27వ తేదీ వీరిద్దరూ మదనపల్లి నుంచి వెళ్లారు. రెండు రోజులకు నాగరాజు తిరిగి వచ్చిన, నరసింహులు ఇంటికి రాలేదు. చాలా రోజులు భర్త కోసం ఎదురుచూసిన నరసింహులు భార్య విజయలక్ష్మి నవంబర్ 20వ తేదీ తన భర్త ఆచూకీ లేదంటూ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్న రూరల్ పోలీసులకు నరసింహులు ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. డిసెంబర్ మూడో తేదీ కేసు నమోదు చేసిన రూరల్ సీఐ కళా వెంకటరమణ, నరసింహులుతో పాటు మంత్రాలు వేసిన నాగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టైల్ లో విచారణ చేశారు. దీంతో నరసింహులు మంగాపురం సమీపంలో హత్య చేసి పూడ్చిపెట్టినట్లు నాగరాజు పోలీసులకు తెలిపాడు. వెంటనే సీఐ కళా వెంకటరమణ మంగాపురంకు వెళ్లి నరసింహులు మృతదేహాన్ని వెలికి తీయించారు. అక్కడే రెవెన్యూ అధికారుల ద్వారా పంచనామా చేయించిన పోలీసులు, శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా నరసింహులు హత్యకు అక్రమ సంబంధమే కారణమని సమాచారం. మామిడి తోటకు తీసుకెళ్లిన సిమ్ములకు కాళ్లు చేతులు కట్టేసి ఉరి తీసి చంపినట్లు తెలిసింది.

## మెగా ఉచిత వైద్యశిబిరం విజయవంతం..

సుండుపల్లె, డిసెంబర్ 12,ప్రభాతవార్త :



మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సంకల్పంతో రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేష్ నాయుడు, మండల అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయం సాధించింది. మండల నలుమూలల నుండి ప్రజలు భారీ సంఖ్యలో శిబిరానికి హాజరయ్యారు. మొత్తం 438 మంది రోగులకు వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించగా, అధిక చికిత్స అవసరమైన 13 మంది రోగులను తిరుపతికి రిఫర్ చేశారు. వీరిని ఆర్థో, న్యూరాలజీ మరియు ఇతర ప్రత్యేక విభాగాల చికిత్స కోసం శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించగా, వారికి ఉచితంగా వైద్యం అందిస్తారని తెలిపారు. డాక్టర్లు డా. వెంకటరమణ ఆర్థోపెడిక్, డా. వెంకటేష్ న్యూరాలజీ,డా.రమణ జనరల్ సర్జరీ చికిత్స ప్రతి రోగికి వ్యక్తిగతంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, చికిత్స సూచనలు అందించారు.చప్పిడి రమేష్ నాయుడు మాట్లాడుతూ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేసిన మండల ప్రజలకు, ముఖ్యంగా సహకరించిన టిడిపి నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రజల ఆరోగ్యం మా అత్యంత ప్రాధాన్యం. భవిష్యత్తులో కూడా మండల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం. మండల ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనేదే మా చప్పిడి సోదరుల అభిలాష" అని తెలిపారు.శిబిరానికి విచ్చేసిన ప్రజలు మరియు టిడిపి నాయకుల కోసం చప్పిడి సోదరులు భోజన వసతి ఏర్పాటు చేశారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం



బద్వేలు అర్బన్ డిసెంబర్ 12 ప్రభాతవార్త :

వాసవి క్లబ్ బెస్ట్ ట్రెజరర్గా అవార్డు పొందిన బైసాని సుమంత్కు పట్టణంలోని పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు నాయకులు వారికి అభినందనలు తెలియజేశారు. శుక్రవారం అన్న క్యాంటీన్ ఎదురుగా వాసవి మెడికల్స్ దగ్గర పలువురు పేద ప్రజలకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఆర్యవైశ్య వర్తక సంగం మాజీ అధ్యక్షులు కే,వీ సుబ్బారావు, వాసవి క్లబ్ అధ్యక్షులు అనుమలశెట్టి సిద్దయ్య, వనితా క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, ఆర్యవైశ్య మహిళా మండలి సెక్రటరీ గంగిశెట్టి ధనలక్ష్మి తో పాటు పలువురు కమిటీ సభ్యుల చేతుల మీదుగా అన్న ప్రసాదం కార్యక్రమాన్ని నిర్వహించారు, ముందుగా పలువురు వాసవి, వనిత క్లబ్ సభ్యులు బైసాని సుమంత్కు శాలువా కప్పి సన్మానించారు. అన్ని దానాలో కల అన్నదానం చాలా మహాదానం అన్నారు,ఆదరణ కోల్పోయిన నిరుపేదలకు ఒకపూట అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో కొండపల్లి సుభాష్, భార్గవ్, చాటకొండు వెంకటసుబ్బయ్య, బచ్చు వెంకట సందీప్, చింతకుంట రవి పలువురు మిత్రులు పాల్గొన్నారు.

## ఎర్రబెల్లి చెరువుకు శాశ్వత జలకళ

2లో

## తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్స్ ఏర్పాటు

### ఉపాధి హామీ పీడీ ఆది శేషారెడ్డి

సిద్దవటం డిసెంబర్ 12 ప్రభాతవార్త



ఉపాధి హామీ పథకం ద్వారా అతి తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్స్ ఏర్పాటు చేస్తున్నామని ఉపాధి హామీ పీడీ ఆది శేషారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ 11వ ఏపీఎస్పీ బెటాలియన్లో శుక్రవారం ఉపాధి హామీ పథకంలో షోకేజ్ తరహాలో ఏర్పాటు చేసిన మ్యాజిక్ డ్రైన్స్ ను పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వర్షం వల్ల వచ్చే నీరు, ఇంటి నుంచి, కిచెన్ నుంచి వచ్చే నీరు, బాత్రూం నుంచి వచ్చే నీరు బయటకు వెళ్లేందుకు ఇంతక మునుపు కాంక్రీటుతో డ్రైన్స్ ఏర్పాటు చేసేవారమన్నారు. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్న విషయమన్నారు. అలాగే ఆయా కాల్వలోకి చెత్త, చెదారం, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థ పదార్థలు చేరుకొని కాల్వలు మూసుకొని పోవడమే కాకుండా మురికి నీటిలో లార్వా వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఎక్కడ పడిన నీరు అక్కడే భూమిలోకి ఇంకిపోయేలా షోకేజ్ మెకానిజమ్ తరహాలో మ్యాజిక్ డ్రైన్స్ ను ఏర్పాటు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో పాటుగా ప్లాస్టిక్ కవర్లు పడినప్పటికీ నీరు ఇంకిపోతుందన్నారు. రోడ్లపై ప్రవహించే వర్షపు నీరు, ఇండ్ల నుంచి వచ్చే బాత్రూం, కిచెన్ నీరు ఇలాంటి డ్రైన్స్ ఏర్పాటు వల్ల ఎక్కడి నీరు అక్కడే ఇంకి పోయేందుకు సులువైన మార్గమన్నారు. జిల్లాలో మోడల్ గా నాలుగు పంచాయతీలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. నాలుగవ పంచాయతీ పెద్దపల్లిలో మ్యాజిక్ డ్రైన్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరసింహులు, బెటాలియన్ పోలీసులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప స్వామి వార్షికోత్సవం

### స్వామియే శరణమయ్యప్ప అంటూ స్వామి నామస్మరణలతో మారుమోగిన అయ్యప్ప స్వామి ఆలయం

### విద్యుత్ దీపాలతో ప్రత్యేక పూలతో ముస్తాబైన అయ్యప్ప స్వామి ఆలయం



బద్వేల్ అర్బన్ డిసెంబర్ 12 ప్రభాత వార్త :



బద్వేల్ పట్టణంలోని నెల్లూర్ రోడ్డు లో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలను కనుల పండగగా తెల్లవారుజాము నుండి ప్రత్యేక హోమాలు, అభిషేకాలతో వైభవంగా నిర్వహించారు, ఏకశిల పడిమెట్లు, 36 అడుగుల రాతి ధ్వజస్తంభంలో కలిపి అద్భుతంగా నిర్మించి ప్రతిష్ట చేసిన శ్రీ విజయ గణపతి శ్రీ సుబ్రహ్మణ్యం స్వామి మరియు అయ్యప్ప స్వామి వారి నూతన దేవస్థానం నిర్మాణం చేపట్టి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ సముద్రాల విజయ్ కుమార్, గౌరవ అధ్యక్షులు రాగి మాను ప్రతాప్ కుమార్ మరియు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోతకముగా పూజలను నిర్వహించారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో పడిమెట్టు పూజ ప్రముఖ గాయకుడు రాజేష్ గురుస్వామి వారిచే ప్రత్యేక కచేరి పలువురు భక్తులను ఆకట్టుకునే భక్తి పాటలు నిర్వహించారు. అలాగే అయ్యప్ప స్వామి దేవాలయం వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం సాయంత్రం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితీష్ కుమార్ రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ వర్దిరెడ్డి ప్రసాదరెడ్డి, చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన చేపట్టి స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చిన పలువురు నాయకులకు ఆలయ సేవా సంఘం కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సత్కరించి ప్రసాదాలను అందజేశారు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా బద్వేల్ పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం చేపట్టి మొదటి వార్షికోత్స వేడుకలను నిర్వహించడం సంతోషకరమని అయ్యప్ప స్వామి అనుగ్రహం బద్వేల్ ప్రాంత ప్రజలందరికీ ఉండాలని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని టిడిపి ఇన్చార్జ్ రితేస్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి ఆకాంక్షించారు, స్వామివారి వార్షికోత్సవ వేడువాల్లో పాల్గొన్న భక్తులందరికీ శ్రీ సుధా కన్స్ట్రక్షన్స్ అధినేత అన్నం రెడ్డి రమణారెడ్డి (గురుస్వామి) వారి సతీమణి వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రకళావతి కుటుంబ సభ్యులు సహకారంతో అల్పాహారం మరియు స్వాములకు, భక్తులకు భిక్షను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్రెడ్డి, ఆలయ వైస్ ప్రెసిడెంట్లు జయ సుబ్బా రెడ్డి, కొప్పరపు ప్రభాకర్, కొండపల్లి సుభాష్, దొంతంశెట్టి జయకుమార్, కొలిశెట్టి నాగరాజా, పెద్దినేని వీర కామేష్ పలువురు కమిటీ సభ్యులు, సీనియర్ అడ్వకేట్ పి.వి.ఎన్ ప్రసాద్, కొలిశెట్టి రమేష్, తులసి నాగరాజా మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, కొలిశెట్టి కృష్ణయ్య, కటారు రామయ్య, సూర్యనారాయణ,గంగసాని వేణుగోపాల్ రెడ్డి, సాంబశివారెడ్డి, మనోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటసుబ్బారెడ్డి, ముమ్మడి నాగేంద్రారెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు పలువురు భక్తులు పాల్గొన్నారు



## మన డబ్బులు మన లెక్కలు పై పారదర్శకతా సమావేశం

రామసముద్రం, డిసెంబర్ 12ప్రభాతవార్త



రామసముద్రం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో బుధవారం ఏపీఎం సాంబశివ ఆధ్వర్యంలో మండల వీఓలకు, ఈసీలకు రివ్యూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపిఎం సాంబశివ మాట్లాడుతూ మన డబ్బు మన లెక్కలపై వివోలకు, ఈసీలకు అవగాహన కల్పించారు. ఉన్నతి రుణాలు ఎస్టి, ఎస్సి కులాలకు సంబంధించిన గ్రూపు సభ్యులు ఎలా తీసుకోవాలి, ఎలా వాడుకోవాలనే దానిపై క్లుప్తంగా వివరణ కల్పించారు.గ్రామాల్లో ఎవ్వరైనా వారి ఇంటిపై సోలార్ పెట్టుకుంటే ప్రభుత్వం రాయతీ పై లోన్ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తికలవారు మీ సి సి లు, సంఘమిత్రాలతో సంప్రదించండన్నారు. యస్ హెచ్ జి ద్వారా బ్యాంకు రుణాలు పొందిన సభ్యుల నుండి ప్రతి నెల డబ్బులు రికవరీలు చేయించాలని,యస్ హెచ్ జి ఇన్కమ్ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా గ్రూపు సభ్యురాలి రుణాలు, జీవనోపాధితో మెరుగైన ప్రణాళిక తదితర సమాచారాన్ని సేకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాంబశివ, డి. ఎం. జి గంగాధర,సిసిలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు వివోలు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## రితేష్‌రెడ్డి దృష్టికి మున్సిపల్ కార్మికుల సమస్యలు

బద్వేలు అర్బన్ డిసెంబర్ 12 ప్రభాతవార్త :



శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ బద్వేల్ పురపాలక సంఘంలో పని చేస్తున్న కార్మికులు సమస్యలతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రధానంగా పారిశుధ్యేతర పనులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య విభాగ కార్మికులను పారిశుధ్య పనులకు కేటాయించాలని, రక్షణ పరికరాలు అయిన కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, దుస్తులు అందించాలని, గత 17 రోజుల సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, చనిపోయిన అదనపు కార్మికుడు దియ్యాల చిన్న వెంకటయ్య కుటుంబంలో ఉపాధి కల్పించాలని, అకారణంగా తొలగించిన డైలీ వేజ్ కార్మికులైన యశ్వంత్, సూరిబాబు లను పనిలోకి తీసుకోవాలని, తదితర కార్మిక న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆయనకు తెలియజేశారు. స్పందించిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కె.రితీష్‌రెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి కమిషనర్‌తో ప్రత్యేకంగా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ షరీఫ్,రూరల్ కార్యదర్శి ముడమాల ఓబుల్ రెడ్డి, పట్టణ నాయకులు చాప్పలి సుధాకర్, యూనియన్ అధ్యక్షులు యన్. సత్యరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు డి.హరి, ఉపాధ్యక్షులు డి.దేవమ్మ, యన్.పాలయ్య కార్యదర్శులు పి.శ్యామ్ ప్రవీణ్,జి. శ్రీనివాసులు,కోశాధికారి కె.శివ కుమార్ కమిటీ సభ్యులు జి.క్రిష్ణయ్య,కె.గురువరప్రసాద్, కార్మికులు ఏ.బాబు, కె.విజయ్,డి.చంద్ర,డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రుల భార్యలకు ఘన స్వాగతం



ఒంటిమిట్ట డిసెంబర్ 12 ప్రభాతవార్త

ఆంధ్ర భద్రాచలంగా పిలువబడే ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దర్శనార్థం శుక్రవారం మంత్రి మండిపల్లి భార్య హరిత, మంత్రి టీజీ భరత్ భార్య ఒంటిమిట్టను దర్శించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యుడు అడ్డలూరి ముద్దుకృష్ణారెడ్డి, రాష్ట్ర మాజీ కల్లుగీత డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య సాదర ఆహ్వానం పలుకుతూ ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఆలయ అర్చకులు టీటీడీ పరిరక్షణలో ఆలయ లాంఛనాలతో ఆహ్వానం పలికి ఆలయ ప్రదక్షిణగావిస్తూ అంతరాలయంలోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పామూరు. సుబ్రహ్మణ్యం, మామిళ్ళ. ఈశ్వరయ్య, భాష, బుజ్జి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చాంద్ బాషా, సుధాకర్ రెడ్డి, బొబ్బిలి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## దోమకాటు ఆరోగ్యానికి చేటు

బద్వేల్ అర్బన్ డిసెంబర్ 12 ప్రభాతవార్త :



దోమకాటు ఆరోగ్యానికి చేటని, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహ రెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో బాలాయపల్లెలో, ఫ్రైడే డ్రై డే కార్యక్రమం జరిగింది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వరాలు రాకుండా దోమల నివారణ చర్యలు తీసుకోవాలని, అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యార్థులకు శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, దోమల ద్వారా మలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధి, బోధకాలు వ్యాధి వస్తుందన్నారు. ఈ దోమలు పుట్టకూడదు, కుట్టకూడదన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రులలో సమృద్ధిగా మందులున్నాయన్నారు. నయం కానీ మొండి వ్యాధులు కూడా ప్రభుత్వ ఆసుపత్రులలో నయమవుతున్నాయి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు కావాలని, ప్రైవేట్ ఆస్పత్రులకు పోయి వేల రూపాయల డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ వీరి జనార్దన్‌రావు, సిహెచ్ఓ జోష్నా, ఏఎన్ఎం రాములమ్మ, హెడ్మాస్టర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

## అమగంపల్లి పంచాయతీలో విలీనం చేయద్దు

కాశినాయన డిసెంబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని అమగంపల్లి గ్రామ పంచాయతిలో ఇటుగుళ్లపాడు గ్రామపంచాయతీలోని అక్కంపేట, కొట్టాలపల్లి గ్రామాలు విలీనం చేయొద్దని అమగంపల్లి గ్రామ పంచాయతీ ప్రజలందరు ముక్తకంఠంతో కలెక్టర్‌కు విన్నవిస్తున్నారు. అమగంపల్లి కేంద్రంగా అమగంపల్లి, అంబవరం, జ్యాన్నేసుపేట,రామచంద్రాపురం గ్రామాలతో 2000 సంవత్సరంలో గ్రామ పంచాయతిగా ఏర్పడిందని అప్పటి నుండి నేటి వరకు ప్రశాంతంగా ఎన్నికలు జరిగి ప్రజలకు ఎలాంటి సమస్యలు, లేకుండా సౌకర్యవంతమైన పాలనా అందిస్తున్నారు. అయితే ప్రతి ఎన్నికల్లో అక్కంపేట, కొట్టాల పల్లి గ్రామాలకు చెందిన నాయకులు, ప్రజలు ప్రతి చిన్నదానికీ ఘర్షణలు పెట్టుకొని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుండటంతో ప్రభుత్వం అమగంపల్లిను పంచాయతీగా చేశారు. అక్కంపేట,కొట్టాల పల్లి గ్రామాలకు చెందిన కొందరు రాజకీయ స్వార్థనాయకులు ఇటుగుళ్లపాడు గ్రామ పంచాయతీ నుండి అమగంపల్లి పంచాయతీలో చేర్చాలని రాజకీయ పావులు కదుపుతున్నారని, వాటిని పరిగణనలోకి తీసుకోకుండా అమగంపల్లిలో వేటిని కలప కుండా యధావిధిగా ఉంచి, ప్రశాంతంగా ప్రజలు ఉండేలా చూడాలని కోరారు. రాజకీయ పంథాతో విలీన దిశగా అడుగులు వేస్తే న్యాయస్థానం ఆశ్రయిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి కి ఇప్పటికే విలీన రిజల్యేషన్లు పంపా లని లేఖలు పంపారన్నారు. వాటిని విరమించుకోవాలని కోరారు.

## పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి కమిటీలే అస్త్రం

తొండూరు డిసెంబర్12 ప్రభాతవార్త :

మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పునర్వ్యవస్థీకరణ వేగం పెంచుకుంది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సూచనలతో గ్రామ గ్రామాన పార్టీ కమిటీలు ఏర్పాటులో చురుకుదనం కనబడుతోంది. శుక్రవారం అగడురు, ఊడవగండ్ల గ్రామాల్లో కొత్త గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశాలకు తొండూరు మండల వైసీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహభరితం చేశారు.గ్రామ స్థాయిలోనే పార్టీ శక్తిని పెంచడం, ప్రజలకు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని చేరవేయడం, ప్రతి ఇంటికీ పార్టీ ఆదర్శాలు పరిచయం చేయడం ఈ కమిటీల ప్రధాన లక్ష్యమని జిల్లా ఉపాధ్యక్షులు డి.వి. శశికాంత్ రెడ్డి తెలిపారు.గ్రామ కమిటీలు ఏర్పాటుతో వైసీపీ గ్రామాల్లో మరోసారి బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు.



## విద్యార్థినికి ప్రథమ బహుమతి

పెనగలూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని ఆంధ్రప్రదేశ్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ పోటీల్లో నల్లపురెడ్డిపల్లె జిల్లా ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె. దేవకి ప్రథమ బహుమతి సాధించి పాఠశాలకు, గ్రామానికి గౌరవాన్ని తెచ్చిపెట్టింది. దేవకిను జిల్లా సుపరింటెండ్ ఇంజనీర్ సోమశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి వెయ్యి అదనపు ప్రోత్సాహంగా అందించారు. కార్యక్రమంకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డైట్ అధ్యాపకులు మడితాటి నరసింహా రెడ్డి, శివ భాస్కర్ విద్యార్థిని ప్రశంసిస్తూ దేవకి ప్రసంగం విద్యార్థులకు మార్గదర్శకంగా నే కాకుండా ప్రతి పౌరున్ని ఆలోచింపజేసేలా ఉందని కొనియాడారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకున్న కె. దేవకి తదుపరి జరగబోయే జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

## సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వినతి

పెద్దమండెం డిసెంబర్ 12 ప్రభాతవార్త



రాష్ట్రంలో గిరిజనులు ఉపాధి అవకాశాలు లేక సమస్యలతో చాలా ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మనోహర్ నాయక్ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మంగళగిరి క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. అరకు కాఫీ తరహా జిసిసి ప్రోడక్ట్‌ను అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసి యువతకు గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. అలాగే గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నారని అలాగే నియోజకవర్గ ప్రాంతాల్లో ఇండస్ట్రీలను ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు గిరిజనులు ఉపాధి పనులు లేక చాలా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలియజేశారు వీటి పరిష్కారానికి సానుకూలంగా ముఖ్యమంత్రి స్పందించారన్నారు.

## జై భారత్ నేషనల్ పార్టీ నేత బిజెపిలో చేరిక

తంబళ్లపల్లె డిసెంబర్ 12 ప్రభాతవార్త ః



జై భారత్ నేషనల్ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇంచార్జ్ పీట్ల అంజలి విశ్వనాథ్ ఆ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. పీట్ల అంజలి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ తరపున పోటీ చేసి గణనీయమైన అణగారిన వర్గాల ఓట్లు సాధించి తదుపరి అణగారిన వర్గాల ప్రజల సమస్యల పట్ల అలుపెరుగని పోరాటం చేస్తూ వచ్చింది. ఆమె చేసిన ప్రజా పోరాటాలను గమనించిన బిజెపి నాయకులు పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం రాజంపేట బిజెపి కార్యాలయంలో జిల్లా బిజెపి అధ్యక్షులు సాయి లోకేష్ అంజలికి బిజెపి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం తో పాటు దేశంలో బిజెపి సారథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు డబుల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని వారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో వస్తున్న స్పందన చూసి బిజెపి లోకి చేరినట్లు చెప్పారు. ఈనెల 14వ తేదీ మదనపల్లిలో జరిగే వాజ్ పాయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి తంబళ్లపల్లె నుండి భారీ ఎత్తున కార్యకర్తలను తరలించి అధినాయకుల ఆశీర్వాదాలు తీసుకుంటారన్నారు. ఆమె వెంట తంబళ్లపల్లె నియోజకవర్గం లోని నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

లక్కిరెడ్డిపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త




బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, జిల్లా బాల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట రవి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపీపీ ఉర్దూ స్కూల్,అంబేద్కర్ గురుకులం గర్ల్స్ హై స్కూల్ నందు బాల్య వివాహ ముతక భరత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల పరిరక్షణ విభాగ ఆఫీసర్ వెంకట రవికుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ దాదిబిలు మాట్లాడుతూ బాల వివాహాల సమస్య పరిష్కారం, మైనర్ల సంక్షేమాన్ని ప్రోత్సాహించేందుకు వీలుగా ప్రభుత్వం 2006లో బాల్య వివాహాల నిషేద చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. 18 ఏళ్లు నిండిన స్త్రీ, 21 ఏళ్లు నిండిన పురుషుడు వివాహానికి అర్హుడన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో బాల పరిరక్షణ విభాగ సిబ్బంది శైలజ సురేష్ రైట్స్ ఎన్జీవో శివ నాగమణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత.

చిట్వేలి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:

నేడు అనగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిట్వేలి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ అధికారి జివి చలపతి తెలిపారు. రాజంపేట బ్రాహ్మణపల్లి 230 కెవి ఉప సబ్ స్టేషన్ నందు మరమ్మత్తులు కారణంగా సరఫరా నిలిపివేత ఉంటుందన్నారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ చలపతి తెలిపారు.

## లక్కిరెడ్డిపల్లె గ్రామీణ రోడ్లకు మహర్దశ

లక్కిరెడ్డిపల్లి; డిసెంబర్ 11, ప్రభాతవార్త



మండలంలోని గ్రామీణ రోడ్ల నిర్మాణానికి 5.56 కోట్ల రూపాయలతో రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన ఈ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మండలంలోని అప్ప కొండయ్యగారిపల్లి నుండి కాలాడివాళ్ళ పల్లెకు 1.67 కోట్లు, లక్కిరెడ్డిపల్లి గంగమ్మ జాతర మర్రిమాను ఆర్వి రోడ్డు నుండి గంగమ్మ జాతర రోడ్డు2.80 కోట్లు, బి ఎర్రగుడి కోనంపేట నుండి కాలాడివాళ్ళ పల్లె రోడ్డు కు 2.08 కోట్లు గ్రామీణ రోడ్లకు తొందరలో పనులు ప్రారంభించి తారోడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లక్కిడిపల్లి మండలానికి అన్ని విధాల సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆయన సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డికు లక్కిరెడ్డిపల్లి మండల ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో ఢీకొని రైతుకు గాయాలు

ములకలచెరువు డిసెంబర్ 12, ప్రభాతవార్త



మండలానికి చెందిన ఓ రైతును బొలెరో ఢీ కొని గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దపాళ్యంకు చెందిన శ్రీరాములు(57) స్కూటీలో పొలం వెళ్లేందుకు బయలు దేరాడు. అదే సమయంలో బొలెరో వాహనం స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో కుటుంబీకులు బాధితున్ని 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్స అందించి, అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకి వెళ్లాలని రెఫర్ చేశారు.

# పెద్దేరు ప్రాజెక్టు పేరు గొప్ప... సౌకర్యాలు శూన్యం

### పట్టించుకోని పర్యాటకశాఖ.. వేధిస్తున్న నిధుల కొరత.

తంబళ్లపల్లె డిసెంబర్ 12 ప్రభాతవార్త ః



అన్నమయ్య జిల్లాలోనే తంబళ్లపల్లెకు సమీపంలోనే పెద్దేరు ప్రాజెక్ట అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ఆయకట్టులో సుమారు 5 వేల ఎకరాల సాగుతో తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాల్లోని సుమారు పదివేల మంది రైతులు, కూలీలకు జీవగర్రగా నిలిచింది. ప్రాజెక్టు నిండితే ప్రాజెక్టుతో పాటు పార్కులు సందర్శనకు ప్రతిరోజు వందలాదిమంది పర్యాటకులతో కళకళ లాడుతుంది. అయితే ప్రాజెక్టు కు వెళ్లడానికి తంబళ్లపల్లెపెద్దమండెం ప్రధాన రహదారి నుండి రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. ప్రాజెక్టు వద్ద గతంలో నిర్మించిన గెస్ట్‌హౌస్, పంప్‌హౌస్, క్వార్టర్స్ శిధిలావస్థకు చేరుకున్నాయి. పర్యాటకులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో నేటి ప్రాజెక్టు, పార్కు, రోడ్డు మరమ్మతులకు పాల కవర్గం నిధులు లేక చేతులెత్తేస్తున్నారు. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ద్వారా రైతులకు సాగునీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద సౌకర్యాల లేమితో సందర్శకులు నిరాశ, నిస్పృహ ప్రదర్శిస్తున్నారు. పెద్దేరు ప్రాజెక్టుతో పాటు పార్కులు సుందరీకరణ, పిల్ల కాలవల మరమ్మతులు, తాగునీరు, రోడ్డు మరమ్మతులు, మౌలిక వసతులు, బోటింగ్ సిస్టం, గెస్ట్ హౌస్ నిర్మాణాలు, రెయిన్ గేజ్ ఏర్పాటు, నిరంతర విద్యుత్తు ఏర్పాటు చేస్తే ప్రతిరోజు పర్యాటకుల సందర్శనతో పాటు ఆదాయం పెరిగే ఆస్కారం ఉంది. దీంతోపాటు ప్రాజెక్టు పరిధిలో చేప పిల్లల పెంపకం ప్రాజెక్టు ఏర్పాటుతో స్థానిక ప్రజలకు జీవనోపాధి ఏర్పడుతుంది. పెద్దేరు ప్రాజెక్టు కు పూర్తిస్థాయిలో ఈ సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన దృష్టి సాధించాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రాజెక్ట్ ఇరిగేషన్ అధికారులు, పర్యాటక శాఖ అధికారులు, పంచాయతీరాజ్, ఉపాధి హామీ శాఖల అధికారులు స్పందించి ఎంతో ఉన్నత ఆశయంతో నిర్మించిన పెద్దేరు ప్రాజెక్ట్ కు పూర్వవైభవం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రాజెక్టు ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్, కమిటీ సభ్యులు, ఆయకట్టు రైతులు, కూలీలు, రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు.

### పదవి తప్ప రూ10 లేదు ప్రాజెక్టు అభివృద్ధి ఎలా!..



పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ గిరి తప్ప ..10 లేదు. గత పాలకుల నిరక్ష్యంతో ప్రాజెక్టులో అన్ని సమస్యలే. ప్రా జెక్టులో రోడ్లు, పార్కులు, పర్యాటకులకు మౌలిక వస తుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి.

- ప్రాజెక్ట్ ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్.

## యువత మేలుకో పోలీస్ కళా బృందం ప్రదర్శన

ముద్దనూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



ఎస్పీ ఆదేశాలతో ముద్దనూరు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పోలీస్ కళా బృందం ఇంచార్జి నరసరాం మరియు సభ్యులచే ఖిఠ యువతా మేలుకో నాటక ప్రదర్శన నిర్వహించారు, సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్ విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. వాటి బారిన పడితే వారి జీవితాలు ఎలా ఉంటాయో కళ్ళకు కట్టినట్టు ప్రదర్శించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు, విద్యార్థులు మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1972కు కాల్ చేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు అని నినాదాలు చేయించారు. ఈ నాటక ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అబ్బర పరుస్తున్న బోయర్ జాతి మేకలు

రామసముద్రం డిసెంబర్ 12 ప్రభాతవార్త



మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అన్సర్ బాషా బోయర్ అనే జాతి మేకలు పెంచుతున్నారు. ప్రపంచంలోనే అధికమాంసోత్పత్తికి ప్రసిద్ధి చెందాయి. రైతు అన్సర్ బాషా మాట్లాడుతూ ఈ బోయర్ జాతి మేకలను కర్ణాటక రాష్ట్రం చింతామణి సమీపంలో వీటిని తీసుకువచ్చానని వీటి సంరక్షణపాటిస్తే అతివేగంగా బరువు పెరగడం, పిల్లలు ఉత్పత్తి పెరగడం జరుగుతుందని, నాణ్యమైన రుచిగల మాంసం, దృఢమైన శరీర నిర్మాణం ఈ మేకల ప్రత్యేకతని అన్నారు. ఇవి కేవలం 4,5 నెలల్లోనే మంచి పోషకాలు అందిస్తే 15 నుంచి 20 కిలోలు, ఏడాదికి, 60,70 కిలోలు పైగా బరువు పెరుగుతాయని వీటిలో మగ మేకలు గరిష్టంగా 105 నుంచి 115 కిలోలు ఆడమేకలు 80 నుండి 90 కిలోలు బరువు పెరుగు తాయన్నారు.

## బయో ఫ్యాక్టర్ వారిచే రైతులకు అవగాహన

రామసముద్రం డిసెంబర్ 12 ప్రభాతవార్త



మండలం ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లి గ్రామంలో శుక్రవారం బయోఫ్యాక్టర్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు ప్రత్యక్షంగా బయోఫ్యాక్టర్, జీవన, సేంద్రీయ ఎరువుల ప్రభావాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఉత్పత్తులను వాడటం వలన భూమి ఆరోగ్యం మెరుగుపడుతూ పంటలు వేగంగా పెరుగుతున్నాయని తెలిపారు. బయోఫ్యాక్టర్ కంపెనీ రీజినల్ మేనేజర్ బి. గంగాధర్ నాయుడు మాట్లాడుతూ, మా ప్రధాన లక్ష్యం రైతులకు అవగాహన కల్పించడం. పొలాల్లో భూమి ఆరోగ్యం మెరుగైనప్పుడు పంటలకు అధిక శక్తి, మంచి అభివృద్ధి మరియు ఎక్కువ దిగుబడులు లభిస్తాయి అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు, పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు బాధ్యతగా పనిచేయాలి

చిట్వేలి, డిసెంబర్ 12, ప్రభాతవార్త:



ప్రతికూల వాతావరణం దృష్ట్యా వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధులను కట్టడి చేసేందుకు ముందస్తు నివారణ చర్యలను చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ నిర్మల్ అలెగ్జాండర్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డెంగ్యు, చికెన్ గున్యా, అతిసారా, బోదకాలు, మెదడు వాపు జ్వరం సంబంధిత సీజనల్ వ్యాధులు నివారణకు పటిష్ట చర్యలను చర్యలను చేపట్టాలన్నారు. ఏఎన్ఎంలు ప్రతి శుక్రవారం గ్రామాల్లో ఇంటి ఇంటికి తిరిగి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేసి ప్రజలకు సీజనల్ వ్యాధులు పట్ల అవగాహన, జాగ్రత్తలను సూచించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్సారీ, డాక్టర్ సల్మా, జోనల్ ఆఫీస్ ఆరోగ్య విస్తరణ అధికారి, సబ్ యూనిట్ అధికారి యస్‌యస్ దాస్, ఆరోగ్య విస్తరణ అధికారులు విజయకుమార్, ధనలక్ష్మి, మరియు సూపెర్వైసోర్ ఇస్మాల్ పాల్గొన్నారు.

## హైస్కూల్లో గ్రంథాలయం ఏర్పాటు

తొండూరు డిసెంబర్12 ప్రభాతవార్త :



తొండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు బెంగళూరుకి చెందిన BREAD CHILDREN SOCITY వారు సహకారంతో 650 పుస్తకాలు మరియు బీరువాతో సహా 1500 పుస్తకాలతో ఒక గ్రంథాలయాన్ని మండల విద్యాశాఖధికారి భారతి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి భారతి మాట్లాడుతూ లోని పుస్తకాలను ప్రతి విద్యార్థి రోజు క్రమం తప్పకుండా చదివి తన జ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలకు విజ్ఞాన బండాగారాలని కావున విద్యార్థులు గ్రంథాలయాన్ని తగిన రీతిలో ఉపయోగించుకుని జ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొని బ్రెడ్ సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోస్టర్‌లు విడుదల చేసిన వైసీపీ ఎన్ఆర్ఐ నేతలు

కడప కార్పొరేషన్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:



ఈనెల 18వ తేదీన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైసిపి కో కన్వీనర్ గోవిందు నాగరాజు, కో కన్వీనర్ మర్రి కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం రక్తదాన శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా జాబ్రియా బ్లడ్ బ్యాంక్ లో రక్తదానం, కేక్ కటింగ్ వంటి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ ఏ.సాంబశివ రెడ్డి, గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బి.హెచ్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి అతిథులుగా వస్తున్నారన్నారు. కార్యక్రమంలో గల్ఫ్ అడ్వైజర్ నాయిని మహేశ్వర్ రెడ్డి, కో కన్వీనర్ మన్నూరు చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గఫార్, నరసారెడ్డి సబ్దార్ మహబూబ్ బాషా, వాసుదేవ రెడ్డి, వాసుదేవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కిషోర్ కుమార్ ప్రభాకర్, సూర్య, కిషోర్, రాజు, సయ్యద్ సజ్జాద్, హరినాథ్, రాంబాబు, వంశీ, నాగముని, హరి ప్రసాద్, సుబ్బరాజు, సురేష్‌రెడ్డి, ఫిలిప్ పాల్గొన్నారు.

## నేటి నుండి ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలు

మదనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త

మదనపల్లి డివిజన్ ఉపాధ్యాయుల క్రీడా పోటీలు నేటి నుండి ప్రారంభం అవుతాయి అని స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజు అదేశాల మేరకు ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలు డివిజన్ స్థాయిలో 13,14 వ తేదీలలో రాష్ట్ర మొత్తం మీద పోటీలు నిర్వహిస్తున్నట్లు, జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. పోటీల పర్యవేక్షకులుగా మండల విద్యాశాఖాధికారి 1,2, స్కూల్ గేమ్స్ కార్యదర్శిలు ఉంటారని, విజేతలైన జట్లు జిల్లా స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. మదనపల్లి డివిజన్ స్థాయి పోటీలు క్రికెట్, బీటీ కళాశాల, నక్కల దిన్నె, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మదనపల్లి, శ్రీవేద పాఠశాల, పోతబోలు లో మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు శ్రీ వేద పాఠశాల లో జరుగుతాయి అని తెలిపారు.

## టిడిపిచే పోస్టర్లు ఆవిష్కరణ

మదనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పట్టణంలోని పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యాలయంలో అటల్ మోదీజీ సుపరి పాలన యాత్ర పోస్టర్లను తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు ఆవిష్కరించారు.భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతిను పురస్కరించుకొని, బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ నెల 14వ తేదీన అన్నమయ్య సర్కిల్ వద్ద నిర్వహించబోతున్న వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేయనున్న కూటమి నాయకులందరికీ స్వాగతం తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: రాష్ట్ర కమిటీ డైరెక్టర్లు పఠాన్ ఖాదర్ ఖాన్, రామకృష్ణ ఆచారి, దేవరెంటి శ్రీనివాసులు, మండ్యం ప్రభాకర్ ,భావన బాబ్జి, బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వెలుగు స్కూలుకు మంచాలు పరుపులు వితరణ

మదనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త



సత్కరిస్తున్న దృశ్యం

విశ్వం కళాశాల ఛైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రోజిలిన్ ప్రియ, అకడమిక్ అడ్వైజర్, కాశయ్య, సిబ్బంది, విద్యార్థులు వెలుగు సంస్థకు 5 మంచాలు, పరుపులు, దిండ్లు వితరణ చేశారు. మదనపల్లె మండలం, కోళ్ళ బైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థకు విశ్వం కళాశాల కు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు, యాజమాన్యం విచ్చేసి ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగుల విద్య బోధన గురించి తెలుసుకున్నారు. పిల్లలతో మాట్లాడి వారి ఇష్టాలను, అభిప్రాయాలను, యోగ క్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమం యొక్క కార్యక్రమాలను తెలుసుకుని, ప్రేమతో పలకరించారు. విశ్వం కళాశాల విద్యార్థులు సేవ దృక్పధంతో విరాళాలను సేకరించి తమవంతు సహాయం కింద సిబ్బంది సహకారంతో దివ్యాంగుల అవసరార్థం 5 మంచాలు, పరుపులు, దిండ్లు అందజేశారు. వెలుగు సెక్రటరీ యం. ఉదయ్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతటి సహాయాన్ని అందించిన విశ్వం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు అభినందించి, వీరికి సహకరించిన విశ్వం కళాశాల ఛైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రోజిలిన్ ప్రియ, అకడమిక్ కాశయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి, వీరికి మెమొంటోను అందజేసి, శాలువాతో సత్కరించారు.

## సమస్యల పరిష్కారానికే టిడిపి ప్రజా దర్బార్

బద్వేలు అర్బన్, డిసెంబర్ 12, ప్రభాతవార్త



టిడిపి ఇన్చార్జ్ రితేష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుండి నేరుగా ఆయన వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి చేరేలా చేయడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా దర్బార్ ముఖ్య పాత్ర పోషిస్తోందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా నాయకులకు తెలిపే అవకాశం ఉందన్నారు. సమస్యలు వేగంగా పరిష్కారం అవుతుండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న, పలువురు నాయకులు, స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి

**సిద్దవటం డిసెంబర్ 12 ప్రభాతవార్త**




ప్రజాభీష్టం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే అకేపాటి అమర్నాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలకేంద్రమైన సిద్దవటం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం జేపీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడవ రోజు మహిళలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు రాజంపేట ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాయచోటి కేంద్రంగా అన్నమయ్య జిల్లాలోకి సిద్దవటం మండలం వెళ్లడంతో ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే కొనసాగేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయన కూడా సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలను కడప జిల్లాలోనే ఉండేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. కడపకు కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిలో కలుపుతూ మళ్ళీ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడంతో సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ప్రజా ఆగ్రహం పెల్లుబికిందన్నారు. సిద్దవటం మండల ప్రజలు రాయచోటికి వెళ్లి కలెక్టర్ ను కలవాలంటే రెండు, మూడు బస్సులు మారాల్సి ఉంటుందని వ్యయ, ప్రయాసాలతో కూడుకున్న విషయమన్నారు. అక్కడికి వెళ్లినా పని జరగకపోతే వారి పరిస్థితి ఏమిటని గంటల తరబడి ప్రయాణం చేసి వెనుతిరగాల్సి వస్తుందన్నారు. అదే కడప అయితే సిద్దవటం మండలానికి అత్యంత దగ్గరగా ఉండడంతో పని జరగకపోతే అరగంటలోనే ఇంటికి చేరుకోవచ్చునన్నారు. మరుసటి రోజు మళ్ళీ వెళ్లి వారి పనులను చేయించుకోవచ్చునన్నారు. ప్రజల కోరికే ప్రభుత్వాలకు శిరోధార్యమని ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మరోసారి పునరాలోచించాలన్నారు. సిద్దవటం మండలాన్ని కడపలో కలిపేందుకు వైఎస్ఆర్‌సీపీ పార్టీ తరుపున తాము సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. అనంతరం దీక్షలు చేస్తున్న సిద్దవటం సర్పంచ్ భవనాశి నాగరాణితో పాటుగా మహిళలకు కొబ్బరి బొండాలు ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో జేపీసీ నాయకులు బండారు రాజగోపాలయ్య బండారు అనసూయమ్మ పోలు వెంకటసుబ్బయ్య, పాలెం నారాయణ, బాలుగారి వెంకట సుబ్బయ్య, అయ్యవారు నాయుడు, అనిల్ కుమార్ రెడ్డి, కొట్టే రాజేష్ వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ సింగం నీలకంఠా రెడ్డి, ఉప మండలాధ్యక్షులు నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ నాయకులు కే.వి సుబ్బయ్య, ఆలం గోపాలస్వామి, కోటపాటి పెంచలయ్య, సయ్యద్ నూర్, కుప్పం సుబ్బారెడ్డి, ఆలం చైతన్య, బత్తల భక్తుడు, మాచనూరు సుబ్బారెడ్డి, కనగాల నరసింహ రావు, రవిశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మార్పణ దినోత్సవం - విద్యార్థులకు పోటీలు

**రాయచోటి డిసెంబర్ 12 ప్రభాతవార్త**



అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని డిసెంబరు 15న ఆత్మార్పణ దినోత్సవం"ను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచనలు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ వంటి పోటీలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పోటీలను మండల స్థాయి పోటీలు ఎంఈఓ 2 ఆధ్వర్యంలో 13న, జిల్లా స్థాయి పోటీలు 14న డైట్ రాయచోటిలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని విద్యాసంస్థలు కర్తవ్యబద్ధంగా నిర్వహించి, పొట్టి శ్రీరాములు త్యాగ స్ఫూర్తిని విద్యార్థులకు తెలిపారు.

## సంఘమిత్ర పని తీరు పైగ్రూపు సభ్యులు ఫిర్యాదు

**నిమ్మనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త**

మండలం ముస్తూరు పంచాయతీ చల్లావారిపల్లి, గ్రూపు సభ్యులు అందరూ కలసి సంఘమిత్ర సరిత పనితీరుపై వ్యతిరేకంగా వున్నారు. ఆమె ప్రవర్తన, సభ్యుల పట్ల అవహేళన కులవివక్షత చూపడం వల్ల ద్వారా వినతి పత్రం సమర్పించారు. అంతవరకు సమువ్వను పరిష్కరిస్తామని చెప్పిన మళ్ళీ సద్దుమణిగి పోయరు. మరల గ్రూపు సభ్యులు సబ్‌కలెక్టర్‌కి ఆమెపై ఫిర్యాదు 20 జనరల్ బాడు మిటింగ్ ద్వారా ఎమ్మెల్యే గారికి పిర్యాదు చేసిన పరిష్కరించకపోవడంతో ఆమె ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని గ్రూపు సభ్యులందరూ నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ నందు నిమ్మనపల్లి ఎస్సైకి ఫిర్యాదు చేశారు.

## బలహీన వర్గాల అభ్యున్నతే తేదేపా లక్ష్యం



**లక్కిరెడ్డిపల్లి; డిసెంబర్ 12, ప్రభాతవార్త**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యమని లక్కిరెడ్డిపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యనుమల మదన్ మోహన్ తెలిపారు. శుక్రవారం అప్పకొండయ్యగారిపల్లి గ్రామం చింతకుంతపల్లి, ఉత్తరమిట్ట హరిజనవాడ, గంగనపల్లి పల్లె బాట కార్యక్రమం నిర్వహించారు గ్రామ ప్రజలు అడుగడుగున ఆత్మీయ స్వాగతాలతో పాటు గజమాలలు దుసలవాలతో సత్కరించి మరియు భారీ బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు అనంతరం మదన మోహన మాట్లాడుతూ ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకుని వారికి కావాల్సినటువంటి త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ కాలవలు మొదలైనటువంటి వారి సమస్యలను పరిష్కరించి కృషి చేస్తానని తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రజా సమస్యలు తిరుతాయిని ప్రజా సమస్యల కోసంకూటమి పెద్దపేట వేస్తుందని తెలియజేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మరియు వారి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో మాట్లాడి ఇండ్లు లేని పేదలకు పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తానని అర్హులైన ప్రతి ఒక్క ఒక్కరికి 3 సెంట్ల ప్రభుత్వ స్థలంతో పాటు పక్క ఇండ్లు నిర్మించడమే తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ షఫీ నాయక్ పాటు, శంకరపు జయరాం, కృష్ణ, డీలర్ అన్వర్ సాధట్, దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేసు, పక్కిరయ్య రామచంద్ర, గురుస్వామి వెంకటేశ్వర్లు, పొట్టి బాబు, పాలెం ధన, కిరణ్, గజేంద్ర రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, లలితమ్మ, సునీల్, రెడ్డెన్న, ధర్మారెడ్డి, ధర్మరాజు, చలపతి, పెద్దచెరువు నీటి సంగం చైర్మెన్ మోహన్ రెడ్డి, బోరెవెల్స్ మల్లయ్య, గంగనపల్లి ప్రభాకర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఏపీ ఎన్జీవోస్



**రాయచోటి డిసెంబర్ 12 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను శుక్రవారం అన్నమయ్య జిల్లా ఏపీ ఎన్జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుస్సాల్వా పూల మొక్కతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎన్జీవో నాయకులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాఏపీ ఎన్జీవో నూతన కార్యవర్గం ఏర్పడడంతో జిల్లా కలెక్టర్‌ను కలవడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఏపీ ఎన్జీవో నాయకులతో మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని మీ సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఏపీ ఎన్జీవో అధ్యక్షులు ఎం వేణుగోపాల్ రెడ్డి కార్యదర్శి శ్రీనివాస్ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్ జిల్లా నాయకులు శివారెడ్డి నాగేశ్వరరావు మహదేవ నరసింహ పద్మనాభం దేవేంద్ర బలరామరాజు పాల్గొన్నారు.

# ఇంధనం పొదుపు చేద్దాం భావితరాలకు వెలుగునిద్దాం

**రాయచోటి డిసెంబర్ 12 ప్రభాతవార్త**



ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇంధన పొదుపు చర్యలు పాటిస్తూ భావితరాలకు భరోసా కల్పించాల్సిన అవసరముందని జిల్లా విద్యుత్ శాఖ (ఏపీ ఎస్పీడీసీఎల్) సూపరిండెంట్ ఇంజనీర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ – ఇంధన పరిరక్షణ మిషన్ (ఎస్ఈసీఎం) భాగస్వామ్యంతో జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఉదయం డివిజన్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు డైట్ అధ్యాపకులచే జిల్లాస్థాయి వకృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మన భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేలా ఇంధన వనరులను బాధ్యతతో వినియోగించాలన్నారు. ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చున్నారు. ఇంధనాన్ని ఆదాచేసే 5 స్టార్ రేటెడ్ ఉపకరణాలు, ఎల్ఈడీ బల్బులు వాడటం వల్ల కరెంటు బిల్లు చాలా తగ్గడమే కాకుండా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర విద్యుత్, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్‌ల గురించి వివరించారు. మన దైనందిన జీవితంలో ఇంధన సంరక్షణ చర్యలను పాటించి, రేపటి తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విజేతలు వీరే. ఇంధన పొదుపు, నిర్వహణ పై నిర్వహించిన వకృత్వ పోటీలలో పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కసిరెడ్డి దేవకి ప్రథమ స్థానం సాధించారు. అలాగేక్విజ్ పోటీలలో రాజంపేట డివిజన్ కు చెందిన జి సమీరా, ఎస్ నిత్యశ్రీ, పి రెడ్డి సాయి, సి వరుణ్‌కుమార్ టీం ప్రజల స్థానంలో నిలిచింది. విజేతలకు సూపరింటెంట్ ఇంజనీర్ సోమశేఖర్ రెడ్డి ఇతర అధికారులతో కలిసి బహుమతులు అందజేశారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్నవారితో ఇంధన పరిరక్షణసంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ రాజశేఖర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, యుగంధర్, అకౌంట్స్ ఆఫీసర్ బ్రహ్మయ్య చారి, డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి, డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివ భాస్కర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 11.40 లక్షల చేప పిల్లలు నీటిలో విడుదల




**ఒంటిమిట్ట డిసెంబర్ 12 ప్రభాత వార్త )**

మత్స్యకారుల సంక్షేమార్తం కోటపాడు సమీపంలో ఉన్న సోమశిల వెనుక జలాల నీటిలో శుక్రవారం మత్స్య శాఖ అధికారులు 11.40 లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరిగింది. రాజంపేట టీడీపీ ఇంచార్జ్ చమర్తి. జగన్మోహన్ రాజు సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు స్పష్టం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడుతూ మత్స్యకారులు తమ వృత్తిలో అభివృద్ధిలో ఉండేందుకు సంక్షేమ పథకాల్లో భాగంగా సోమశిల వెనుక జలాలలో చేప పిల్లలను వదలడం ఎంతో శుభదాయకమన్నారు. గ్రామీణ ప్రాంత మత్స్యకార దినదినాభివృద్దిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 80100 మీ. మీ. లు కలిగిన 11.40 లక్షల చేప పిల్లలు ఉచితంగా వదలడం జరిగిందన్నారు. 0.30 లక్షల కట్ల చేప పిల్లలు, రోకు 3.90 లక్షలు మరియు మృగాలు 7.20 లక్షల పిల్లలు ప్రభుత్వ ఫిష్ సీడ్ ఫార్మా కడప క్షేత్రంలో పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అతిథిగా బెస్తా కార్పోరేషన్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో సుజాత, సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారాజు, ఫారెస్ట్ అధికారులు, కడప డిడి నాగయ్య, అన్నమయ్య జిల్లా డీఎఫ్ఓ సుస్మిత, ఎఫ్డిఓ కిరణ్ కుమార్, ఆర్ .బాలరాజు, పీఎఫ్ ఏ నూరి మస్తానమ్మ, ప్రసన్న క్రాంతి, బాల కుమార్ రెడ్డి, ఫీల్డ్ సిబ్బంది నిత్య పూజ రమణ, కులయప్ప, ఒంటిమిట్ట జడ్పిటిసి అడ్డలూరి. ముదు కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ వెంకటరమణ, కొత్తపల్లె బొబ్బిలి రాయుడు, భాను ప్రకాష్ రాజు, కోటపాటి .సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే



**ప్రొద్దుటూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త**

కడప కార్పొరేషన్ మేయర్ మరియు ముద్దనూరు మండలాధ్యక్షుల ఎన్నికలను ప్రజాస్వామ్య బద్దంగా నిర్వహించిన అధికారులకు మాజీ ఎమ్మెల్యే వైఎస్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప మేయర్ సురేష్ బాబును కక్ష్యపూరితంగా పదవీచిత్తుని చేయడంతో పాటు గతంలో 3 సమావేశాలకు హాజరు కాలేదనే సాకుతో ముద్దనూరు ఎంపిపిని అధికార కూటమి నాయకులు తొలగించగా, గురువారం ఎన్నికల కమిషన్ ఎన్నికలకు పిలుపునివ్వడంతో ఉప ఎన్నిక జరిగిందని, ఈ నేపథ్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పర్యవేక్షణ, ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ షెల్కే ఆధ్వర్యంలో పోలీసుల గట్టి బందోబస్తు నేపథ్యంలో అధికార పార్టీ వారికి సరైన మెజారిటీ లేని కారణంగా, దౌర్జన్యం చేసే పరిస్థితి లేని కారణంగా వారు ఎన్నికలకు రాలేదని, దీంతో వైసీపీ అభ్యర్థులు రెండు చోట్ల ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుపొందారని వివరించారు. ఇది ప్రజాస్వామ్య విజయం అన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ప్రతిపక్షంలో కూడా విజయాలు సాధించడంతో పాటు, ప్రజా ఉద్యమాలలో, పార్టీ కార్యక్రమాల నిర్వహణలో జిల్లాలో ముందంజలో వుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన అధికారులకు, వైసీపీ ప్రజా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం లావణ్య, రాగుల శాంతి, గరిశపాటి లక్ష్మిదేవి, నూకా నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ పిట్టా భద్రమ్మ, నాయకులు రాయపురెడ్డి, నాయకురాళ్లు గజ్జల కళావతి, పార్వతీ పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సు విప్లవానికి సిద్ధం చేస్తున్న కళాశాల



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పీలేరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:**

పీలేరు పరిసర ప్రాంతాల్లోని ఎం.జే.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సృష్టిసామర్థ్య కృత్రిమ మేధస్సు పై ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు తాజా టెక్నాలజీలలో నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ దిశగా కళాశాల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని వెబ్ వాయిడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు సాయి లక్ష్మణ్, రాజేష్, బాలాజీల నాయకత్వంలో నిర్వహిస్తున్నారు. వారు విద్యార్థులకు కృత్రిమ మేధస్సు వల్ల ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, వివిధ రంగాల్లో జరిగే మార్పులు, రాబోయే సంవత్సరాల్లో ఆధారిత సాంకేతికత మరింత విస్తరించబోయే అవకాశాలు వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా సృష్టిసామర్థ్య కృత్రిమ మేధస్సు ప్రాముఖ్యతను ఉదాహరణలతో వివరించడంతో పాటు, ఈ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలు, పరిశ్రమల్లో పెరుగుతున్న డిమాండ్, విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాల్సిన నైపుణ్యాలపై కూడా దృష్టి సారించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.ఎన్.వి. నరసింహ రావు మాట్లాడుతూ, నేటి యుగంలో సాంకేతిక పరిజ్ఞానం కేవలం చదువులోనే కాకుండా కెరీర్ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తుందని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కొత్త టెక్నాలజీలు నేర్చుకోవడంలో ముందుండాలి, భవిష్యత్తులో ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై పాల్గొన్నారు.

## జగన్, చంద్రబాబు తెలుగు భాష విధ్వంసకులు



**వేంపల్లె: డిసెంబర్ 12 (ప్రభాత వార్త)**

ఆంగ్లేయుడైన సర్ సిపి బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సూరీడు కాగా, తెలుగు వారైన జగన్, చంద్రబాబు తెలుగు భాష విధ్వంసకులు కావడం దురదృష్టకరం, శోచనీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లిలో స్వర్గీయ సర్ సిపి బ్రౌన్ దొర 141 వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఒక ఆంగ్లేయుడైన సర్ సిపి బ్రౌన్ ఈస్టిండియా కంపెనీ తరపున భారతదేశానికి వచ్చి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశాడని అన్నారు. అందుకే బ్రౌన్ దొర తెలుగు భాషోద్ధారకుడు, తెలుగు సూర్యుడు అయ్యాడని తులసి రెడ్డి కీర్తించారు. కానీ దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్లో అటు జగన్ పాలనలో, ఇటు చంద్రబాబు పాలనలో తెలుగు భాష పరిస్థితి నానాటికి క్షీణిస్తూ ఉండడం శోచనీయమన్నారు. గతంలో జగన్ ప్రభుత్వం 2019 నవంబర్ 20వ తేదీన జీవో 85 ద్వారా పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దుచేసి ఆ స్థానములో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టడం ఒక చారిత్రిక తప్పిదమన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవో 85 ను రద్దు చేయకుండా కొనసాగించడం గర్హనీయమన్నారు. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరి చేయాలని ,లేదా తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉన్నత విద్యలో, ఉద్యోగాల విషయంలో రెండు శాతం అదనపు మార్కులు కలపాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆ విధంగా చేయలేకపోతే తమ పార్టీ పేరును మార్చుకొని ఇంగ్లీష్ దేశం లేదా ఆంగ్ల దేశం అని పెట్టుకోవలసిందిగా తులసి రెడ్డి తెలుగుదేశం పార్టీకి సూచించారు .బ్రౌన్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు బండారు వెంకటేశు, బద్రీనాథ్, రాఘవయ్య, చిన్నకోట్ల నాగరాజు, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్కోచే విద్యార్థులకు బహుమతులు ప్రధానం



బహుమతులు ప్రధానం చేస్తున్న ఈ ఈ

**మదనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త**

శక్తి పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా మదనపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు శుక్రవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.గంగాధరం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ డిప్యూటీ ఈఈ వై హరి కుమార్, టౌన్ ఏఈలు రామలక్ష్మయ్య, అజయబాబు, కుమార్ బాబు, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి , భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన చల్లా రాజగోపాల్ యాదవ్

**ప్రొద్దుటూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అభ్యర్థులు మేరకు అభ్యర్థన మేరకు తనను టిడిపి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షునిగా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 11, 12 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పడిన కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ తో పాటు పట్టణ ప్రధాన కార్యదర్శి నల్లబోతుల నాగరాజు లు శిక్షణా తరగతులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమకు అవకాశం కల్పించిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి లకు ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా కొల్లా పురమ్ము వార్షి కోత్సవం

**కె.వి.పల్లె, డిసెంబరు 12 ప్రభాతవార్త:**



కె.వి పల్లె మండలం లోని గర్నెమిట్టలో వెలసిన కోల్హాపురమ్మ వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు, ఈసందర్భంగా ఆలయంలోని అమ్మవారికి, ఉత్స వ విగ్రహానికి గరిమిట్ట సురేష్ శర్మ విశేష పూజలతో పాటు హోమం జరిపారు. ఈసందర్భంగా అమ్మవారికి ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, రక్షా బంధన, ఉత్సవ మూర్తికి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం రుద్రాభిషేకం, దుర్గావ హనం శక్తి శ్రీ శూక్త హవనం, గణపతి సహిత నవగ్రహ హోమాలు, పూల్లా ముళి కార్యత్రైమాలు జరిపార అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి చాందిని బండ్లు డప్పు మేళతాళాలకు, పిల్లన గోవి, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

**మదనపల్లి డిసెంబర్ 12 ప్రభాతవార్త**



ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ భాష తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ప్రజా సమస్యలను అర్జీలు రూపంలో స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులను ఆదేశించడం జరిగింది అన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యను బట్టి గడువు లోపల పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మోతి నగర్ లోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే జామియా మసీదులోని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట పలువురు పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలు

**మైదుకూరు, డిసెంబర్ 12, ప్రభాతవార్త:**

భారత ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, మై భారత్ మరియు అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో కడప రోడ్డు మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానం నందు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ వాలీబాల్ పోటీలో 12 జట్లు పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిదిగా అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి వాలీబాల్ పోటీలు ఘనంగా ప్రారంభించి మాట్లాడుతూ శరీర దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆనందం కొరకు క్రీడలు ఎంత ముఖ్యమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో ఆడాలని ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ వాలీబాల్ పోటీలు నందు ప్రథమ స్థానంలో నిలిచిన కరుణగిర జట్టు, ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీ బాల శివ యోగేంద్ర మహారాజు డిగ్రీ కళాశాల జట్లకు నగదు బహుమతి తో పాటు ట్రోఫీ, మెడల్స్, మరియు సర్టిఫికెట్స్ మేధా డిఫెన్స్ అకాడమీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారెడ్డి చేతుల మీదుగా అందించారు.




## అరటిలో నాణ్యమైన దిగుబడులు

**పెండ్లిమర్రి, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

కడప ఉద్యానశాఖ వారి ఆధ్వర్యంలో ఉద్యాన సహాయ సంచాలకులు రవి చంద్రబాబు అరటిలో నాణ్యమైన దిగుబడులకు గెలల యాజమాన్యం ఏ విధంగా చేయాలి, అలాగే అరటిలో బంచ్ కవర్లు కట్టుకునే పద్ధతి వాటి ఉపయోగాలను వివరించడం జరిగింది. ముఖ్యంగా అరటిలో మొగ్గ ఏర్పడిన దశ నుంచి బంచ్ ఇంజెక్షన్ డెల్టా మెత్రిన్ 1 మి.లీ / లీటరు నీటిలో కలిసి 80 మి. లీ నుంచి 100 మి. లీ ద్రావణాన్ని ఇంజెక్షన్ చేయాలని అలాగే పలు రకాల విధానాలను రైతులకు వివరించడం జరిగింది. కొత్త గంగిరెడ్డిపల్లె, కొత్త గిరియంపల్లి గ్రామాల్లో అరటి తోటలను సందర్శించి రైతులకు అవగాహన మరియు బంచ్ కవర్ల ప్రదర్శనను చూపించడం జరిగింది. 50% రాయితీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానాధికారి రెడ్డయ్య, ఆర్ ఎస్‌కె సిబ్బంది సురేష్, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.




## రీ సర్వేలో అధికారుల నిర్లక్ష్యంపై ధ్వజం

**కలికిరి, డిసెంబరు 12, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లెలో భూములకు సంబంధించి జరుగుతున్న రీ సర్వేలో అధికారుల నిర్లక్ష్యంపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వేంపల్లె నూర్జహాన్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ మాట్లాడుతూ మర్రికుంటపల్లె పంచాయతీలో రీ సర్వే జరుగుతోందని రీ సర్వే జరిగే ముందు రైతులకు ముందుగా నోటీసులు జారీ చేసి రీ సర్వేలో పాల్గొనే విధంగా సమాచారం అధికారులు ఇవ్వకుండా వాట్సాప్ గ్రూపుల్లో పెడుతూ రీ సర్వే నిర్వహిస్తున్నారని దీంతో రైతులు రీ సర్వేపై సమాచారం అందక శాపంగా మారే ప్రమాదం ఉందని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామాల్లో రైతులకు సమాచారం లేకుండానే వారి భూములను సర్వే సిబ్బంది సర్వే చేశారని రైతులు లబోదిబోమంటూ తమ దృష్టికి తెచ్చినట్లు సమావేశంలో పేర్కొన్నారు. రీ సర్వే సక్రమంగా జరిగేలా చూడాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారుల తీరు మారలేదని సర్పంచ్ మండల స్థాయి అధికారుల దృష్టికి తెచ్చారు. పంచాయతీలో ఎస్సీలు, బీసీలు, మైనార్టీలకు సంబంధించిన భూములున్నాయని ఆ భూములు సర్వే చేయకనే పంచాయతీలో భూముల సర్వే చేయడం పూర్తయిందని అధికారులు హడావిడి చేయడంపై సభ్యులు మండిపడ్డారు. గతంలో 13 పంచాయతీల్లో రీ సర్వే జరిగిందని ఆ సర్వేలో అధికారులు నిర్లక్ష్యం చేయడంపై ఇప్పటికీ రైతులు పలు సమస్యలపై తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ముందుగా నోటీసులు జారీ చేసి మర్రికుంటపల్లె పంచాయతీలో రీ సర్వే సక్రమంగా చేయాలని సర్పంచ్ అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ రీ సర్వేలో రైతులకు ముందస్తు సమాచారం అందించి ఆ తరువాతే రీ సర్వే జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, మేడికుర్తి వైద్యాధికారి కావ్యగంధ, ఏపీఎం దేవసేన, ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్, పశువైద్యాధికారి గిరినాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రిని కలిసిన జనసేన నాయకులు

**లక్కిరెడ్డిపల్లి డిసెంబర్ 11 ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను విజయవాడ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన దుశ్యాలతో సత్కరించిన మండల జనసేన పార్టీ ఇంచార్జ్ నిమ్మనపల్లి పవన్ కుమార్ ఈ సందర్భంగా ఆయనకు వినతిపత్రం సమర్పించారు. రాయలసీమలోనే గంగమ్మ జాతర అతిపెద్ద జాతర అని జాతర నందు పర్యటక శాఖ కింద జాతర చుట్టూ పార్కును ఏర్పాటు చేయాలన్నారు. అంతే కాకుండా అక్కడ భక్తులు బస చేసేందుకు హోటల్ లాడ్జిలను ఏర్పాటు చేయాలని విందతి పత్రం సమర్పించారు అలాగే పార్టీని గ్రామస్థాయి లో బలోపేతం చేయాలని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రతి ఒక్కరికి వివరించి అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నక్క గోపికృష్ణ జయ భవ్య తదితరులు పాల్గొన్నారు.